సేవకు పరమార్థం వలంటీర్ వ్యవస్థ

- సీఎం జగన్‌పై పొగడ్తలు గుప్పించిన.. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, ఎమ్మెల్యే మేడా
- వలంటీర్‌లకు అవార్డులు అందజేత

రాజంపేట రూరల్ : ప్రజలకు నిరంతరం సేవ చేస్తున్న వలంటీర్లు సేవకు పరమార్థంగా నిలుస్తున్నారని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కొనియాడారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం 'వలంటీర్‌లకు వందనం' కార్యక్రమాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డితో కలిసి వలంటీర్‌లను ఆకేపాటి, మేడా శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. అదే విధంగా సేవా వజ్ర అవార్డు గ్రహీతలకు రూ.45లు, సేవా రత్న అవార్డు గ్రహీతలకు రూ.30 వేలు, సేవా మిత్ర అవార్డు గ్రహీతలకు రూ.15 వేలు నగదును అందజేశారు. మున్సిపల్ పరిధిలోని 29 వార్డుల్లోని 13 సచివాలయాల పరిధిలో 198 మంది వలంటీర్లు ఉన్నారు. వారిలో ఉస్మాన్‌నగర్–1 సచివాలయ నుంచి వట్టికళ్ల సత్యం, ఆర్‌ఎస్ రోడ్–1 సచివాలయం నుంచి మౌలాలి, సాయినగర్ సచివాలయం నుంచి మిణుకు శ్రీవాణీ, బలిజపల్లి రోడ్ సచివాలయం నుంచి బోనం ఉషాకుమారీ, రెడ్డివారి వీధి నుంచి షేక్ బదర్‌షాహెబ్‌లకు సేవా రత్న అవార్డులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలను సాకారం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. నిరంతర సేవలు అందిస్తున్న వలంటీర్‌లను ప్రతి ఏడాది వలంటీర్‌కు వందనం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తరపున సత్కరిస్తున్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి వారికి అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైఎస్ చైర్మన్ మర్రి రవి కుమార్, కౌన్సిలర్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, తహసీల్దార్ అనుబనస్, మేనేజర్ శేషఫణీ, డీఈ ఈశ్వరరెడ్డి, ఏఈలు శిల్ప, ఆర్‌ఐడీ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.


అవార్డులు అందుకుంటున్న వలంటీర్లతో ఆకేపాటి అమరనాథరెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి

మండల పరిధిలో...

స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం వలంటీర్‌లకు వందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ వేడుకలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న అమరనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి వలంటీర్‌లను ఘనంగా సన్మానించారు. మండలంలోని 19 సచివాలయ పరిధిలో 306 మంది వలంటీర్‌లు విధులు నిర్వహిస్తున్నారు. అందులో పోలీ సచివాలయానికి చెందిన జానకి సేవా రత్నకు అర్హత సాధించింది. అప్పారాజుపేట సచివాలయం నుంచి తాళ్లపాక చాముండేశ్వరి, హస్తవరం సచివాలయం నుంచి నాగలక్ష్మి, ఎంజీపురం సచివాలయం నుంచి తోడేటీ ఆదెమ్మ, మిట్టమీదపల్లి సచివాలయం నుంచి గొంటు మధు, ఊటుకూరు సచివాలయం నుంచి సిగిచెర్ల గాయత్రీలను సేవా రత్న అవార్డులు దక్కాయి. ఈ వేడుకలో వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ విభాగాల కన్వీనర్లు పాల్గొన్నారు.

వలంటీర్లే ప్రభుత్వ సంక్షేమ వారధులు

గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేసే గ్రామ వలంటీర్లే ప్రభుత్వ సంక్షేమ వారధులని మల్లికార్జునరెడ్డి, ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం స్థానిక హరితా కల్యాణ మండపంలో ఒంటిమిట్టలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించి, వారికి సేవా వజ్ర, సేవా రత్నా, సేవా మిత్ర అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులైనా ప్రతి ఒక్కరికి పారదర్శకంగా అందించడంలో గ్రామ వలంటీర్లు పాత్ర గొప్పదని కొనియాడారు. రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ రఘురాంరెడ్డి, ఈఓపీఆర్‌డీ రంగయ్య, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు గాలివీడుకు ఎమ్మెల్యే రాక

గాలివీడు : గాలివీడు మండల కేంద్రానికి నేడు (శనివారం) రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి వస్తున్నట్లు ఎంపీడీఓ టీడీ శ్రీనివాసులు, ఇన్‌చార్జి తహశీల్దార్ తిమ్మారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్‌కే ఫంక్షన్ హాల్లో వలంటర్లకు సన్మాన కార్యక్రమం, అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో 2003కు ముందు పట్టాలు పొందిన రైతులందరికీ సర్వహక్కు భూ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, రైతులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రెన్యువల్ చేసుకోండి

గాలివీడు : మండలంలో ప్రభుత్వ చౌక దుకాణాలకు అథరైజేషన్ రెన్యువల్ చేసుకోవాలని ఇన్‌చార్జి తహశీల్దార్ తిమ్మారెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఉస్మాన్ బాషా తెలిపారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి చౌక దుకాణదారుడు ఆన్‌లైన్ పద్ధతి ద్వారా అథరైజేషన్ కోసం నమోదు చేసుకోవాలని తెలిపారు. లేకపోతే విజిలెన్స్ అధికారులు చౌకదుకాణం తనిఖీ సమయంలో పట్టుబడితే రూ.20 వేలు జరిమానా విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, చౌకదుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన


ఉపాధ్యాయుల బోధనను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుల బృందం

రాజంపేట రూరల్ : అభ్యసనాభివృద్ధి రాష్ట్ర పరిశీలన బృందానికి చెందిన సోషల్ పరిశీలకులు ఎం వసంత, సైన్స్ పరిశీలకులు బీడీ మధుసూదనరెడ్డి, గణిత పరిశీలకులు నరసింహారెడ్డి, ఇంగ్లీష్ పరిశీలకులు రహంతుల్లా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన, పిరియడ్లలో పాటించాల్సిన మెళుకువలను వివరించారు. తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థుల కోసం తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎంఓ ఎస్.రామకృష్ణ, ఎంఈఓ సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్టును పరిశీలించిన డీడీ


చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డీడీ తదితరులు

చిట్వేలి : బర్డ్ ఫ్లూ నివారణలో భాగంగా నెల్లూరు–అన్నమయ్య జిల్లా సరిహద్దు చిట్వేలి మండలంలోని అనుంపల్లి వద్ద అంతర్ జిల్లా చెక్‌పోస్టును రాజంపేట పశుసంవర్ధకశాఖ డీడీ విజయ్ భాస్కర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాయిలర్ కోళ్ల రాకపోకల నియంత్రణ చర్యలు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చిట్వేలి ఏరియా పశువైద్యశాల ఏడీ కేడీ వరప్రసాద్, డాక్టర్ భువనేశ్వరి, ఎల్‌ఎస్‌ఏ మణి, డీఈఓ నాయక్ గోపాలమిత్ర, సుబ్బయ్య పాల్గొన్నారు.

శ్రీ భద్రకాళీ దేవికి రాహుకాల పూజలు


ప్రత్యేక అలంకరణలో భద్రకాళీ అమ్మవారు

రాయచోటి టౌన్ : భద్రకాళీ దేవి అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహణలో భాగంగా ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణయ్య స్వామి అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయల హారాలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకులు రాహుకాల పూజల విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఎమ్మెల్యే నివాళి

రామాపురం : మండలంలోని కర్ణపువాండ్లపల్లెకు చెందిన కర్ణపు చిన్నసుబ్బారెడ్డి (76) అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఉదయం చిన్నసుబ్బారెడ్డి భౌతికకాయానికి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, పలువురు మండల నాయకులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

మహిళల ఆశాజ్యోతి సీఎం జగన్


సమావేశానికి హాజరైన డ్వాక్రా మహిళలు

ఒంటిమిట్ట : మహిళలకు ఆశాజ్యోతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలిచారని మేడా మల్లికార్జునరెడ్డి, ఆకేపాటి అమర్ నాథ్‌రెడ్డి ప్రశంసించారు. శుక్రవారం స్థానిక హరితా కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా మల్లికార్జునరెడ్డి, అమర్ నాథ్‌రెడ్డి ఒంటిమిట్ట మండలంలో 543 స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు రూ.4 కోట్ల 81 లక్షల 62 వేల రూపాయలు, సిద్దవటం మండలంలో 666 స్వయం సహాయక సంఘాల డ్వాక్రా మహిళలకు రూ.6 కోట్ల 19 లక్షల 21 వేల రూపాయల వైఎస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో మహిళలను దృష్టిలో ఉంచుకుని మహిళల అభ్యున్నత కోసమే రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. అనంతరం ఆకేపాటి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, స్వతంత్రంగా ఎదగాలనే ఉద్దేశంలో మహిళల కోసం అనే సంక్షేమ పథకాలు సీఎం జగన్ అమలు చేస్తున్నారని తెలిపారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభివృద్ధికి రెండు అడుగులు వేస్తే.. ఆయన తనయుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాలుగు అడుగులు ముందుకు వేశారని కొనియాడారు. డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, ఒంటిమిట్ట మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, సిద్దవటం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నీలకంఠారెడ్డి, ఒంటిమిట్ట, సిద్దవటం మండల ఏపీఎంలు నాగార్జున నాయుడు పాల్గొన్నారు.

కమిటీలు ఏర్పాటు చేసుకోండి


గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లి, హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాల్లోని ఆలయాల పరిహారం కొరకు కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సీపీఓ సుదర్శన్ రెడ్డి, తహసీల్దార్ శేషగిరిరావు గ్రామస్తులకు తెలియజేశారు. శుక్రవారం రెవెన్యూ, ఏపీఎండీసీ అధికారులు మంగంపేట కాపుపల్లి, హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశాల మేరకు గ్రామాల తరలింపులో ఆలయాలకు సంబంధించి కమిటీలను ఏర్పాటు చేసుకోవడం వలన వారికి నేరుగా పరిహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మినుగు సుధాకర్, ఆర్ఐ రామ్మోహన్ నాయుడు, రెవెన్యూ సిబ్బంది ప్రమీల, డీఆర్‌సీసీయూ మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి, పులపుత్తూరు సుదర్శన్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీతో అరచేతిలో విజ్ఞానం

- గ్రంథాలయాల ద్వారా స్వీయ అధ్యయనం సాధ్యం
- రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి


డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న మల్లికార్జునరెడ్డి

ఒంటిమిట్ట : అరచేతిలో విజ్ఞానాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ లైబ్రరీని అందుబాటులోకి తెచ్చినట్లు రాజంపేట శాసనసభ్యులు మేడా వెంకట మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించడానికి లైబ్రరీలు, డిజిటల్ లైబ్రరీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. శుక్రవారం చింతరాచుపల్లిలో రూ.16 లక్షల వ్యయంతో నిర్మించిన డిజిటల్ లైబ్రరీని మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. అంతకుముందు రూ.20 లక్షల అంచనా వ్యయంతో రూపొందించిన ప్రహరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మొబైల్ ఫోన్లు, టీవీలపై ఆసక్తి చూపుతున్న విద్యార్థులను పుస్తక పఠనం వైపు మళ్లించేందుకు డిజిటల్ లైబ్రరీలు దోహదపడతాయన్నారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు స్టడీ మెటీరియల్, న్యూస్ పేపర్లు, మ్యాగజైన్లు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఇప్పటికే సచివాలయం భవనం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంతో పాటు పాలశీతలీకరణ కేంద్రం, ఇప్పుడు డిజిటల్ లైబ్రరీతో ప్రభుత్వ సేవలు ఒకే ప్రాంగణంలో ప్రజలకు అందుబాటులో వచ్చాయన్నారు. డిజిటల్ లైబ్రరీ, ప్రహరీ నిర్మాణం అత్యద్భుతంగా తీర్చిదిద్దిన కాంట్రాక్టర్‌ను అభినందించారు. ప్రజలతో కలిసి ఎమ్మెల్యే ఆత్మీయ విందు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగమ్మ, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ సభ్యులు ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ గజ్జల శ్రీనివాసులురెడ్డి, పార్టీ నాయకులు వెంకటరమణ, భాస్కర్, నరసింహనాయుడు, ఎర్రయ్య, వెంకటసుబ్బయ్య, శ్రీను, నారాయణ, యామన వెంకటసుబ్బయ్య, అబ్బన్నగారి వెంకటసుబ్బయ్య, రాసోల చిన్నబ్బి, కదరయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో మెరుగైన వైద్యం


కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు

ఓబులవారిపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం జరుగుతోందని వైద్యాధికారి ముద్దా రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గోవిందంపల్లి పంచాయతీలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు అన్ని విధాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. స్పెషలిస్టు వైద్యులచే వైద్య సేవలు అందించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుశాయిస్వామి, వైద్యాధికారి దేవేంద్రరెడ్డి, సర్పంచ్ ధనలక్ష్మి, ఎంపీటీసీ రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పోష్ యాక్ట్‌తో మహిళలకు రక్షణ


మాట్లాడుతున్న జడ్జి లత

నందలూరు (రాజంపేట) : ప్రతి మహిళకు లైంగిక వేధింపులు నుంచి పోష్ చట్టం ద్వారా రక్షణ కలుగుతుందని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, నందలూరు, రాజంపేట, కోడూరు ఎఫ్‌ఎస్‌సీ జూనియర్ సివిల్ జడ్జి కె. లత పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో పోష్ యాక్ట్ గురించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో మహిళలను వేధించడం నేరమని, అందుకు సంబంధించిన చట్టాలు, శిక్షలు గురించి వివరంగా తెలియజేశారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ లైంగిక వేధింపులపై వివరించారు. ఈ చట్టం ప్రకారం ప్రతి ఆర్గనైజేషన్‌లో పదిమంది లేక అంతకుమించి ఉన్న చోట ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందలూరు, రాజంపేట, రైల్వేకోడూరుకు సంబంధించిన ఏపీపీలు, ఎంఆర్‌ఓలు, ఎండీఓలు, స్కూల్ హెడ్మాస్టర్లు, పోలీస్ అధికారులు, ఏపీఎస్‌పీడీసీఎల్, వెలుగు ఆఫీసర్లు, నందలూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పీఎల్‌వీలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నియోజకవర్గ ఎన్నికల అధికారి లీలారాణి


సమావేశంలో మాట్లాడుతున్న లీలారాణి

రైల్వేకోడూరు : ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా ఎవరు పనిచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ ఎన్నికల అధికారి లీలారాణి తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లీలారాణి మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని పగడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని బూత్ లెవల్ అధికారులు ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట తహసీల్దారు నరిసింహులు, డిప్యూటీ తహసీల్దారు అమరేశ్వరి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు సిద్ధేశ్వరరావు, బూత్‌లెవల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి


పల్స్‌పోలియో చుక్కలపై అవగాహన కల్పిస్తున్న రంగలక్ష్మి

సిద్దవటం : పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పొన్నపోలు పీహెచ్‌సీ వైద్యాధికారి రంగలక్ష్మి కోరారు. సిద్దవటంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు, వాలంటీర్లు, వైద్య సిబ్బందికి పల్స్ పోలియోపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలియో రహిత సమాజం కోసం 0–5 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలను వేయించాలన్నారు. మార్చి 3,4,5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయాలన్నారు. పోలియో చుక్కలు వికటిస్తే వెంటనే పీహెచ్‌సీకి పంపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శంషాద్‌బేగం, సూపర్‌వైజర్ రామ్మోహన్, పద్మావతి, రూట్ అధికారులు కాలేబ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆశావర్కర్‌లు, వైద్యసిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడల్లో విద్యార్థుల సత్తా


ట్రోఫీలతో విద్యార్థులు

రామాపురం : 2023–24 సంవత్సరం ఏపీఎస్‌జీఎఫ్ రాష్ట్ర, జిల్లాల స్థాయిలో జరిగిన క్రీడల్లో అన్నమయ్య జిల్లా రామాపురం మండలం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయిలో 18 రాష్ట్రస్థాయిలో రాణించారు. రాష్ట్ర, జిల్లాల స్థాయిలో జరిగిన యోగ, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, వెయిటింగ్, సైక్లింగ్, 800 మీటర్ల రన్నింగ్, స్లీపింగ్, 100 మీటర్లు హెడ్ లైన్స్, బాస్కెట్ బాల్ వివిధ క్రీడ భాగాల్లో విద్యార్థులు సత్తాచాటారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ పుష్పలత, పీఈటీలు రమీజా, ఉపాధ్యాయులు అభినందించారు.

రిజిస్ట్రేషన్ చేయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

సిద్దవటం : వివిధ కారణాల వలన రిజెక్ట్ అయిన హౌసింగ్ లబ్ధిదారులను పిలిపించి శనివారం లోగా రిజిస్ట్రేషన్ చేయించాలని వీఆర్‌ఓను ఆదేశించామని తహసీల్దార్ మురాషావలి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వీఆర్‌ఓల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన హౌసింగ్ రిజిస్ట్రేషన్ పత్రాలను విజయవాడ నుంచి రాగానే వీఆర్‌ఓలు ప్రింటు తీసి ఇవ్వాలని సూచించామన్నారు. సిద్దవటం మండలం లోని 40 పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని తెలిపారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో నీటి వసతి, మరమత్తులు చేయించాలని, ర్యాపర్లను ఏర్పాటు చేయాలని వీఆర్‌వోలను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవిలత, ఆర్ఐ అనూరాధ, వీఆర్‌ఓ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలి

డీఎస్పీ సుధాకర్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సుధాకర్

రాయచోటి : రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతి పోలీస్ అధికారి ఎన్నికల నిర్వహణ పట్ల అవగాహన పెంచుకోవాలని డీఎస్పీ సుధాకర్ ఆదేశించారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ సుధాకర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి.. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎంతమంది ఓటర్లు ఉన్నారనే విషయాలను తెలుసుకోవాలని సూచించారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆర్డీఓ


సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీఓ

సంబేపల్లె : తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ రంగస్వామి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇంటిస్థలాల రిజిస్ట్రేషన్‌లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ అసోసియేషన్ జిల్లా కౌన్సిలర్‌గా శ్రీనివాసులు


శ్రీనివాసులకు డిక్లరేషన్ పత్రాన్ని అందజేస్తున్న ఎంపీడీఓ

లక్కిరెడ్డిపల్లి : పంచాయతీరాజ్ అసోసియేషన్ జిల్లా కౌన్సిలర్‌గా ఎన్నికైన వి శ్రీనివాసులకు శుక్రవారం పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు లంక మల్లేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, ఎన్నికల అధికారి, ఎంపీడీఓ రామిరెడ్డి, ఏఓ గురుప్రసాద్ డిక్లరేషన్ పత్రాన్ని అందజేశారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎంపిక చేసిన జిల్లా అధ్యక్షుడు లంక మల్లేశ్వర్‌రెడ్డికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా కోటాలమ్మ వార్షికోత్సవాలు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మంటపంపల్లె పంచాయతీ మారయ్యగారిపల్లి గ్రామంలో వెలసిన కోటాలమ్మ వార్షికోత్సవాలు రెండరోజు శుక్రవారం ఘనంగా కొనసాగాయి. రెండోరోజు కోటాలమ్మకు ప్రతకాల పూజ ప్రత్యంగిరే కలశ ఆవాహన, అగ్ని ప్రతిష్టాపన, మహా మంగళహారతి ఇచ్చారు. సాయంత్రం ప్రదోషకాల పూజలు, వేద పారాయణం, కలశ యంత్రాలు, దీపార్చన, మహా నివేదనం సమర్పించారు.

షాపింగ్ కాంప్లెక్స్ వేలం పాట

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో బస్టాండ్ గేటు, నాలుగు షాపింగ్ కాంప్లెక్స్ రూముల వేలం పాటను ఈ నెల 29వ తేదీ స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి శుక్రవారం తెలిపారు. 29న ఉదయం 11 గంటలకు లక్కిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహిస్తామని, ఆసక్తిగల వారు పాల్గొనాలని కోరారు.


దోమలను తరిమికొడదాం

సంబేపల్లె : గ్రామీణ ప్రాంతాలలో జ్వరాలు బారిన పడకుండా ఉండాలంటే దోమలను తరిమికొట్టాలని వైద్యులు సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దుద్యాల గ్రామం, పెద్ద జంగంపల్లిలో వైద్య సిబ్బందితో కలిసి దోమల మందు పిచికారి చేశారు. జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమతెరలు తప్పకుండా వాడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రేపు బండలాగుడు పోటీలు

సిద్దవటం : మండలంలోని శివునిపల్లె గ్రామంలో వెలసిన శ్రీ కాశిరెడ్డినాయన స్వామి ఆరాధన ఉత్సవాల సందర్భంగా ఈ నెల 25న ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఈ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన ఎద్దుల జతకు మొదటి బహుమతిగా రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఆయన సోదరులు రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ సిద్దవటం మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డి రూ.50 వేలు నగదు అందించనున్నారు. రెండవ విజేతకు మాధవరం–1 మాజీ సర్పంచ్ మేకపాటి సుబ్బారెడ్డి రూ.30 వేలు అందించనున్నారన్నారు. మూడవ బహుమతి విజేతకు మాజీ సర్పంచ్ నాగం వెంకటసుబ్బమ్మ రూ. 20 వేలు ఇవ్వనున్నారు.

చర్చనీయాంశంగా ఫ్లెక్సీలు


రాజంపేట, సుండుపల్లెలో ఏర్పాటైన వింత ఫ్లెక్సీ

రాజంపేట : రాజంపేట నియోజకవర్గంలోని పలు మండలాల్లో వింత బ్యానర్లు వెలిశాయి. రాజంపేట, సుండుపల్లెలో రాత్రికి రాత్రే ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఏవరు చేశారు.. ఎందుకు చేశారు.. అనేది అంతుపట్టడంలేదు. 'అరెత్తాయ్.. ఇట్నే సూచ్చావుండు అంటూ' వెలసిన ఫ్లెక్సీల్లో ఈ ప్రాంత యాస ముద్రించడం గమనార్హం. దీనికి అర్థ మేమిటో అంతుపట్టడం లేదని చూపర్లు అంటున్నారు. ఏదీ ఏమైనప్పటికీ నియోజకవర్గంలో వింతఫ్లెక్సీలు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

డీటీగా మాధవి లత బాధ్యతల స్వీకరణ

సిద్దవటం : సిద్దవటం డిప్యూటీ తహసీల్దారుగా మాధవి లత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కడప కలెక్టరేట్‌లో డిప్యూటీ తహసీల్దారుగా పని చేస్తున్న.. ఈమె సిద్దవటం డిప్యూటీ తహసీల్దారుగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.